సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 8, జూలై, 2024



సోమశిలలో 10.057 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 10.057 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 307 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. దిగువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,785
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,989
నవర (8 గ్రాములు)	రూ.55,912

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /27.4

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగాఉంటుంది. పగలు, రాత్రి వేడి వాతావరణం ఉండనుంది. వాతావరణంలో తేమ 60 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కండలేరులో 6.330 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి కండలేరు జలాశయానికి 70 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏహెచ్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అనిమల్ హస్బెండరీ (ఏహెచ్) పాలిటెక్నిక్ డిప్లొమా రెండేళ్ల కాలవ్యవధి గల కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెంగల్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు సోమవారం నుంచి వర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 27వ తేదీతో ముగుస్తుందని, ఎస్ఎస్‌సీలో విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు www. svvu. edu. in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. మరిన్ని వివరాలకు పనిదినాలలో 9398647710, 9398813600 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలియజేశారు.

వేలిముద్రలు తీసుకున్నారు.. పింఛన్ ఎగ్గొట్టారు..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని వవ్వేరుకు చెందిన ఇద్దరు వృద్ధుల గత నెల పింఛన్‌ను సంబంధిత అధికారులు కాజేశారు. ఆదివారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. గత నెల 6న కంటి ఆపరేషన్ చేయించుకున్న అరవ బుజ్జమ్మ అదే రోజు స్థానిక సచివాలయంలో పింఛన్ నగదు కోసం వేలిముద్ర వేసింది. అదే గ్రామానికి చెందిన మరో వృద్ధుడు శ్రీనివాసులు పింఛన్ కోసం వేలిముద్ర వేశారు. అయితే ఇద్దరికీ ఇప్పటి వరకు పింఛన్ అందలేదు. అధికారులు విచారించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



ప్రగతి రేడు.. రాజశేఖరుడు

వైఎస్సార్.. ఈ మూడు అక్షరాల పేరు వింటే అన్నదాతే కాదు.. పుడమి తల్లీ పులకిస్తోంది. వర్షపు నీటిని ఒడిసి పట్టి సాగుకు మళ్లించిన అపర భగీరథుడు. సింహపురి సిగలోని జలనిధి నుంచి జిల్లా నలుమూలలకు గంగమ్మను ఉరకలెత్తించారు. బంజరు భూములకు జలసిరులు అందించి బంగరు భూములుగా మార్చిన జలయాజ్ఞికుడు. ఉమ్మడి జిల్లా తీరంలో మధ్య భాగంగా కృష్ణపట్నంలో పోర్టు నిర్మించి ప్రపంచ స్థాయి పటంలో నెల్లూరుకు స్థానం కల్పించిన భవిష్యత్ స్వాప్నికుడు. పవర్ ప్రాజెక్టులతో జిల్లాలో వెలుగులు నింపిన వెన్నెల రేడు. పారిశ్రామిక సెజ్‌ల్లో విదేశీ సంస్థలను స్థాపించి అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు. నిరుద్యోగాన్ని రూపు మాపి లక్షల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన వల్లభుడు. దశాబ్దన్నర కాలం గడిచినా జిల్లా అన్నదాతల మదిలో రాజన్న స్థానం పదిలం.

జిల్లాకు జలసిరులు అందించిన జలయాజ్ఞికుడు

- కృష్ణపట్నం పోర్టుతో భవిష్యత్‌ను కాంక్షించిన స్వాప్నికుడు
- విద్యుదుత్పత్తి కేంద్రాలతో వెలుగులు నింపిన వెన్నెల రేడు
- శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు పారిశ్రామికవాడలతో అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు
- లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించిన వల్లభుడు
- సింహపురి అభివృద్ధిలో రాజన్న ముద్ర

నేడు వైఎస్సార్ జయంతి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అన్నపూర్ణగా ఖ్యాతి గాంచిన సింహపురిని జలసిరిగా మార్చిన జలయాజ్ఞికుడు. దాదాపు మూడు దశాబ్దాలపైకు పైగా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వందల రూ.కోట్లతో ప్రాజెక్ట్‌లకు పునాదులతో జలయజ్ఞానికి శ్రీకారం చుట్టిన పాలక కర్షకుడు. 2004 ఎన్నికలకు ముందు వైఎస్సార్ నిర్వహించిన పాదయాత్ర తర్వాత జిల్లాలో బస్సు యాత్రలో అడుగడుగునా అన్నదాతలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో సాగునీటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. జలయజ్ఞం ద్వారా వందల రూ.కోట్లతో సమగ్ర సోమశిల నుంచి పెన్నా, సంగం బ్యారేజీల నిర్మాణం వరకు అన్నింటికి ఆయన అంకురార్పణ చేశారు. ప్రధానంగా 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిల నీటి సామర్థ్యాన్ని రెండు దశల్లో 78 టీఎంసీల స్థాయికి తీసుకు వచ్చారు. సమగ్ర సోమశిలలో భాగంగా 104 కిలో మీటర్ల పొడవునా ఉత్తర కాలువను సోమశిల నుంచి ప్రకాశం జిల్లా కందుకూరు వరకు అభివృద్ధి చేసి నీటి ఔట్ ఫ్లో సామర్థ్యాన్ని పెంచారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లా రైతుల సమగ్ర సోమశిల కలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏటా 35 నుంచి 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిలను జలయజ్ఞం ద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.



మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ

వృథా నీటి ఒడిసి పట్టి..

వృథాగా సముద్రంలో కలుస్తున్న కృష్ణా నది వరద నీటిని శ్రీశైలం డ్యాం నుంచి కరువు ప్రాంతమైన రాయలసీమకు కేవలం 1,500 క్యూసెక్కుల తరలించేందుకు గతంలో ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని అధికారికంగా 44 వేల క్యూసెక్కులని చెప్పినా వాస్తవంగా 1.10 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో రోజుకు దాదాపు 10 టీఎంసీలు తరలించే విధంగా అభివృద్ధి చేశారు. పెన్నార్ డెల్టాతో పాటు మెట్ట ప్రాంత భూములను సస్య శ్యామలం చేసేందుకు జలయజ్ఞం ద్వారా రూ.220 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఉత్తర కాలువను 104 కి.మీ. ప్రకాశం జిల్లా కందుకూరుకు పొడిగించి ఆ ప్రాంత రైతుల భూములను తడిపేలా చేశారు. సోమశిల ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 5,84,500 ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు ప్రతిపాదన చేశారు. ఇందులో 4,05,500 ఎకరాలు మాగాణి భూములు స్థిరీకరించడానికి 1,79,000 ఎకరాలు కొత్త ఆయకట్టును స్థిరీకరించారు. దీంతో ఇప్పటికి దాదాపు 5,34,583 ఎకరాలకు పారుదల జరుగుతుంది. 49,917 ఎకరాలు ఆయకట్టు పారుదల జరగాల్సి ఉంది. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణానది జలాలు సోమశిల రిజర్వాయర్ నుంచి కండలేరు జలాశయానికి, చెన్నై తాగు నీటి అవసరాలకు 15 టీఎంసీలు పంపాల్సి ఉంది.

ముంపు పరిహారంలో నెలకొన్న జాప్యం, అటవీశాఖ అనుమతులు లభించని పరిస్థితిపై దృష్టి సారించారు. ముంపు ప్రాంత బాధితుల పరిహారాన్ని వెంటనే విడుదల చేయించారు. వైఎస్సార్ పాలన ఏడాదిలోపే 48 టీఎంసీల నీటి నిల్వను 51 టీఎంసీల వరకు నీటి నిల్వ సామర్థ్యం పెంచారు. 2007–08లో 317 కాంటూరు వరకు నింపి పూర్తి స్థాయిలో 51 టీఎంసీ నిల్వ ఉంచేలా చేశారు. అనంతరం 326 కాంటూరు వరకు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వైఎస్సార్ జిల్లా ఎగువరాచపల్లి అడ్డంకిగా ఉండేది. ఈ గ్రామానికి యుద్ధప్రాతిపదికన పరిహారం చెల్లించి ఖాళీ చేయించి నీటి సామర్థ్యం పెంచేలా చేశారు. జలాశయంలో నీటి సామర్థ్యాన్ని 72 టీఎంసీల వరకు పెంచేలా చేసి సింహపురి రైతుల్లో హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ నిర్మాణంతో..

జిల్లాలోనే కీలక ప్రాజెక్టులైన సంగం, పెన్నా బ్యారేజీలపై దృష్టి సారించి 2006 మే 28న రూ.98 కోట్ల వ్యయంతో సంగం బ్యారేజీ శంకుస్థాపన చేశారు. 800 మీటర్ల పొడవుతో దీన్ని నిర్మించి 0.45 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో పాటు డెల్టా స్థిరీకరణకు దోహదపడేలా సిద్ధం చేశారు. అయితే నిర్మాణ వ్యయం పెరగడంతో 2008లో రీ టెండర్లు నిర్వహించి ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.149.60 కోట్లకు పెంచి పనులు వేగవంతం చేశారు. ఆయన మరణానికి ముందు వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయి. తదనంతర పాలకులు దీనిపై నిర్లక్ష్యం వహించడంతో పనులు ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లుగా మారాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి పనులు వేగవంతం చేయించి ప్రజలకు అంకితం చేశారు. దీంతో జిల్లాలోని 3.85 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడింది. పెన్నాడెల్టాలో 2.47 లక్షల ఎకరాలకు, కనుపూరు కెనాల్ పరిధిలో 63 వేల ఎకరాలు, కావలి కెనాల్ 75 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రానున్న రోజుల్లో కొత్త ఆయకట్టు సాగులోకి రావడానికి దోహదపడింది. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో సాగుకు మేలు చేకూరుతోంది. సోమశిల నుంచి 40 కిలో మీటర్ల దిగువ భాగంలో దీన్ని నిర్మించడం ద్వారా కుడి వైపున నెల్లూరు చెరువు, నెల్లూరు కాలువ, కనుపూరు కాలువ, కనిగిరి ప్రధాన కాలువ, దువ్వూరు కాలువ, కావలి కాలువ పరిధిలోని 3.85 లక్షల ఎకరాల సాగుకు ఇబ్బంది లేకుండా నీటి విడుదల జరుగుతోంది.

నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పెన్నా బ్యారేజ్‌తో..



2008లో పెన్నాబ్యారేజ్ రూ.126 కోట్ల వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. 0.55 టీఎంసీ నీటి సామర్థ్యంతో తలపెట్టిన పెన్నా బ్యారేజీ తదనంతరం రీ టెండర్ల ద్వారా రూ.149.39 కోట్లకు చేరింది. దివంగత మహానేత హయాంలో పరుగులు తీసిన అభివృద్ధి మళ్లీ ఆయన తనయుడు దృష్టి సారించి పూర్తి చేశారు. 57 గేట్లతో 637 మీటర్ల పొడవుతో 10.90 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా బ్యారేజ్‌ని నిర్మించారు. నెల్లూరు బ్యారేజ్ నిర్మాణంతో 5 మండలాల్లోని 72 గ్రామాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువల పరిధిలోని ఈ ఆయకట్టు పూర్తిగా నీరు అందుతోంది. నెల్లూరు నగర తాగునీటి అవసరాలు తీరుతాయి. నెల్లూరు–కోవూరు మధ్య దూరం తగ్గింది.

మహానేత దూరదృష్టి.. అభివృద్ధి సృష్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దూరదృష్టితో అభివృద్ధి సృష్టించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 169 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో మధ్య భాగం కృష్ణపట్నంలో పోర్టును నిర్మించారు. ఈ పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులతో ప్రపంచ స్థాయిలో సింహపురి కీర్తిని నిలిపారు. ఈ పోర్టు ద్వారా జిల్లాలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు బీజాలు వేశారు. జిల్లాకే కాకుండా రాష్ట్ర, కేంద్ర ఖజానాలకు ఆదాయవనరుగా మార్చారు. మరో వైపు అదే ప్రాంతంలో ప్రభుత్వ రంగంలో 2,400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి.. జిల్లాలో వెలుగులు నింపారు.

– సూళ్లూరుపేట నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధి సృష్టించారు. మూడు సెజ్‌లతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి వైపు పరుగులు తీసి ప్రజల జీవన విధానంతో ముఖచిత్రమే మారిపోయింది. తడ మండలం మాంబట్టు, ఉమ్మడి నెల్లూరు – చిత్తూరు జిల్లాల సరిహద్దులో సత్యవేడు, వరదయ్యపాళెం, తడ మండలాలను కలుపుకుని సుమారు ఆరు వేల ఎకరాల్లో శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాయి. నాయుడుపేటలోని మేనకూరును కలిపి మూడు సెజ్‌ల్లో హిందూస్థాన్ నేషనల్ గ్లాస్, గ్రీన్‌టెక్, లాయల్ టెక్స్‌టైల్స్, ప్రైమ్ మేడిన్, హీమెయిర్, అరబిందో ఫార్మా తదితర సుమారు 300కు పైగా భారీ పరిశ్రమలున్నాయి. ఎంతో మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించిన ఘనతను దివంగత వైఎస్సార్‌కే దక్కుతోంది. కృష్ణపట్నం పోర్టు, చెన్నై, రేణిగుంట విమానాశ్రయాలు, సోమశిల జలవనరులు పుష్కలంగా ఉండడంతో ఈ సెజ్‌లు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతున్నాయి.

ఇసుక ఉచితం కాదా!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల్లూరు సిటీ, కోవూరు నియోజకవర్గాల్లోని ప్రాంతాలకు 10 టన్నుల ఇసుక రవాణాకు రూ.5,500లకు చేరేది. టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతాలకు ఇసుక పల్లిపాడు యార్డు నుంచి రవాణా జరగాలి. అక్కడ 10 టన్నుల ఇసుక ధర రూ.3,700. అక్కడి నుంచి నెల్లూరు సిటీ, కోవూరు నియోజకవర్గాల్లోని ప్రాంతాలకు టిప్పర్, లారీ రావాలంటే.. రూ.5 వేలకు తక్కువకు వచ్చే అవకాశం లేదు. ఇప్పుడు ఆ లెక్కన చూస్తే.. 10 టన్నుల ఇసుక ధర రూ.8,700 పడుతోంది. గతంతో పోల్చుకుంటే.. ఇప్పుడు అదనంగా రూ.3,200 అదనంగా కొనుగోలుదారులపై భారం పడనుంది.

- టీడీపీ చివరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఇసుక విధానమే అమలు
- ఇసుక విక్రయాలపై నాడు దుష్ప్రచారం
- గతంలో టన్ను ఇసుక ధర రూ.475
- ప్రస్తుతం టన్ను రూ.370లకు విక్రయం
- ఇసుక రవాణా ఇక పెను భారం
- ఉచితంగా ఇచ్చామంటూ గతంలో గప్పాలు.. ఇప్పుడు వ్యాపారం

ఇసుక విక్రయాలపై ఉత్కంఠకు తెర పడింది. ఇసుక ఉచితం పేరుతో విక్రయాలు చేస్తోంది. ఎలాంటి లాభాపేక్ష లేదంటూనే ఇసుక వ్యాపారానికి ప్రణాళిక సిద్ధం చేసింది. రీచ్‌ల నుంచి యార్డులకు తరలించడానికి అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తున్నామంటూ టన్ను ఇసుకను రూ.370లకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. టీడీపీ తీసుకు వచ్చిన కొత్త ఇసుక పాలసీ 'కొత్త సీసాలో.. పాత సారానే' చందంగా ఉంది. నిన్నటి వరకు ఇసుక విధానంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించి.. తాజాగా టీడీపీ ప్రభుత్వం చివరికి వైఎస్సార్‌సీపీ పాలసీనే అమలు చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ప్రభుత్వం ప్రజల కళ్లల్లో 'ఇసుక' కొట్టింది. నిన్నటి వరకు ఇసుక కొనుగోలు భారమంటూ తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు.. అంతకు మించిన భారాన్ని వినియోగదారులపై పెట్టింది. ఇసుక ధర తగ్గింపు పేరుతో.. పెను భారం మోపింది. ఇసుక ఉచితం కాదు.. టన్నుల లెక్క ధర నిర్ణయించి విక్రయించాలని టీడీపీ ప్రభుత్వం ఇసుక పాలసీని ఆదివారం ప్రకటించింది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని అమలు చేయనుంది. గత ప్రభుత్వం ఇసుక రవాణా చార్జీలతో కలిపి ధర నిర్ణయిస్తే.. ఈ ప్రభుత్వం రవాణా చార్జీలు మినహాయించి ధర నిర్ణయించింది.

ఉచితంగా ఇచ్చామంటూ గప్పాలు

గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ఇసుక పాలసీ తెచ్చింది. ఇసుక కొనుగోలుకు నేరుగా ఎవరూ రీచ్‌ల్లోకి వెళ్లి ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేయకుండా మైనింగ్ శాఖ పర్యవేక్షణలో ఇసుక తవ్వి.. యార్డుల్లో నిల్వ చేసింది. అక్కడి నుంచి వినియోగదారులు టన్నుల వంతున కొనుగోలు చేసే విధంగా విధివిధానాలు ప్రకటించింది. ఇసుక పాలసీ తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుక విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. అయితే అప్పటి ప్రతిపక్షం టీడీపీ ఇసుక విక్రయాలపై దుష్ప్రచారం చేసింది. తమ ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక సరఫరా చేశామంటూ గప్పాలు కొట్టుకుంది. అయితే వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 'ఇసుక ఉచితం' పేరుతో రీచ్‌లను కుళ్లబొడిశారు. ఆ ఐదేళ్లు ఏ నాడు ప్రజలకు ఉచితంగా ఇచ్చిన పాపాన పోలేదు. ఇసుక రీచ్‌ల్లో టీడీపీ కేడర్ మోహరించి ట్రాక్టర్‌కు ఇంత.. టిప్పర్‌కు ఇంత చొప్పున దోపిడీ చేసింది. నదుల్లో ఇసుక అడుగంటి పోయినప్పటికీ బావుల్లాంటి గోతులు పెట్టి సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ స్థాయి నేత వరకు రూ.కోట్లు కొల్లగొట్టారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామంటూ గప్పాలు కొడుతూ రీచ్‌ల నుంచి యార్డులకు తరలించడానికి అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు పేరుతో టన్ను ధర రూ.370లకు విక్రయిస్తోంది.

రవాణా చార్జీలతో కలిపి టన్ను ఇసుక ధర (గతంలో)

నియోజకవర్గం	టన్ను ధర రూ.ల్లో
నెల్లూరు సిటీ	550
కోవూరు	550
నెల్లూరు రూరల్	625
సర్వేపల్లి	825
ఆత్మకూరు	585
ఉదయగిరి	775
కావలి	760
కందుకూరు	970

ఇప్పుడు రవాణా చార్జీలు తడిసి మోపెడు

టీడీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇసుక పాలసీతో వినియోగదారులకు తడిసిమోపుడు అవుతోంది. గత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో నలుమూలల సమాన దూరంలో ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. జిల్లాలో పెన్నాతీరం విస్తరించిన పొట్టేపాళెం, జొన్నవాడ, సంగం, అనంతసాగరం, అప్పారావుపాళెం, మినగల్లు, పల్లిపాడు, ముదివర్తి, ముదివర్తిపాళెం, రాజుపాళెం, తెలుగరాయపురం, వాశిలి, సుబ్బారెడ్డిపాళెం తదితర ప్రాంతాల నుంచి ఇసుకను సేకరించి.. ఆయా డంపింగ్ యార్డులకు తరలించే ప్రక్రియ చేపట్టింది. అయితే ఇసుక అన్ని రీచ్‌ల్లోనూ టన్ను ధర రూ.475గా నిర్ణయించింది. ఇక నియోజకవర్గ కేంద్రాల నుంచి ఆ సమీప ప్రాంతాలకు తరలించే ఇసుక ధరలు దూరాన్ని బట్టి రవాణా చార్జీలతో కలిపి ధరలు నిర్ణయించింది. అయితే తాజాగా ప్రభుత్వం కేవలం జిల్లా వ్యాప్తంగా మూడు ఇసుక రీచ్‌ల వద్ద ఏర్పాటు చేసిన యార్డుల నుంచే తరలించాలని నిబంధన పెట్టింది. యార్డు వద్ద టన్ను రూ.370 ధర నిర్ణయించింది. గత ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే.. రూ.105 తగ్గించినట్లు చెప్పినా.. ఇప్పుడు మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు స్టాక్ యార్డుల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్లే వాహనాలకు రవాణా చార్జీలు నియంత్రణలో ఉండవు.

టన్ను ఇసుక ధర రూ.370



ఇసుక జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

- నేటి నుంచి జిల్లాలో ఇసుక విక్రయాలు ప్రారంభం
- మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు స్టాక్ యార్డుల నుంచి సరఫరా
- రోజుకు ఒక్కో వ్యక్తికి 20 టన్నులకు మించకుండా విక్రయం
- ఫిర్యాదులకు, టోల్ ఫ్రీ నంబరు 1800-425-6034 ఏర్పాటు
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ వెల్లడి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు. ఇసుక సరఫరాపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని మూడు స్టాక్ యార్డుల్లో ప్రస్తుతం 1,75,301 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. మర్రిపాడు 1,25,211 మెట్రిక్ టన్నులు, మినగల్లులో 41,885 మెట్రిక్ టన్నులు, పల్లిపాడులో 8,205 మెట్రిక్ టన్నులు ప్రస్తుతం సరఫరాకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక యార్డులకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తరలించి తీసుకు వచ్చేందుకు అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా టన్నుకు రూ.370 ఇసుకను విక్రయించేందుకు నిర్ణయించారన్నారు. స్టాక్ యార్డుల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని ఎవరికి వారు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రవాణాశాఖ నిర్ణయించిన ధరలు మేరకే వాహనాల యజమానులు ఇసుక రవాణా చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి ఉంటుందని, అంతకు మించి అధికంగా వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు స్టాక్ యార్డుల వద్ద నుంచి ఇసుక రవాణా చేసేందుకు గనుల శాఖ జారీ చేసిన రవాణా అనుమతి పత్రం ఇవ్వబడుతుందని, ఇసుక రవాణాను ఆ అనుమతి పత్రాల ద్వారానే రవాణా చేయాలన్నారు. వాహన తనిఖీల సమయంలో ఈ రసీదును చూపించాల్సి ఉంటుందన్నారు. ప్రతి స్టాక్ యార్డు వద్ద నూతన ఇసుక విధానం 2024 బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వాగులు, వంకల్లో ఇసుక రవాణాకు ఎండ్ల బండ్ల ద్వారానే అనుమతి

గ్రామాల్లో ఉన్న వాగులు, వంకల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించవచ్చునని, అయితే ఏ గ్రామంలో ఉన్న వాగులు, వంకల నుంచి ఆ గ్రామస్తులే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతిస్తారన్నారు. ఇతర ప్రాంతాల వారు అక్కడి ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతించరన్నారు. జిల్లాలో ఇసుక స్టాక్ యార్డుల వద్ద ఇసుకను పోలీసుశాఖ పహారాలో ఉంటుందన్నారు, సెబ్ అధికారులకు ఇసుకను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా చూడాల్సిన బాధ్యత అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు ఇసుక యార్డులను తనిఖీ చేస్తూ ఇసుక సరఫరాను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ చెప్పారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 18004256034, 0891-2943569 ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. సోమవారం ఉదయం నుంచి ఈ ఫోన్ నంబరులో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఉచిత ఇసుక సరఫరాపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు అన్ని మండల, డివిజన్ కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని గనుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరాలో సమస్యలు వస్తే పరిష్కరిండానికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని, రెవెన్యూ, గనులశాఖ, సెబ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, సెబ్ అదనపు ఎస్పీ సౌజన్య, నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలు ఏ మలోల, మధులత, గనులశాఖ డీడీ ఏ శ్రీనివాస్‌కుమార్, భూగర్భజల శాఖ డీడీ శోధన్‌బాబు, ఉప రవాణా శాఖ కమిషనర్ చందర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై ఆదివారం చోటు చేసుకుంది. మృతుడు సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగి, తెలుపురంగు గల హాఫ్ హ్యాండ్స్ చొక్కా, తెలుపురంగు పంచె ధరించి ఉన్నాడు. మృతుడి ఒంటిపై యజ్ఞోపవితం ఉంది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జీ మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని రెండు షాపుల్లో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న రవి కూల్‌డ్రింక్స్ తలుపులు పగులగొట్టి రూ.50 వేల విలువ చేసే సిగరెట్లు, ఇతర సామగ్రిని అపహరించారు. అలాగే మమ్ము మొబైల్ షాపులో రూ.80 వేల విలువ చేసే సెల్‌ఫోన్లను చోరీ చేశారు. ఆదివారం ఉదయం గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండో విజేత నాయుడుపేట



నాయుడుపేట క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ఆదివారం రాత్రి వరకు జరిగిన నెల్లూరు జిల్లా స్థాయి తైక్వాండో– 2024 చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నాయుడుపేట క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నాయుడుపేట విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో నెల్లూరు, తృతీయ స్థానంలో వేదాయపాళెం, నాలుగో స్థానంలో వెంకటగిరి క్రీడాకారులు నిలిచినట్టు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. వారికి ట్రోఫీలను అందించి ఘనంగా సత్కరించారు. తైక్వాండో మినీ సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలతో పాటు మెమెంటోలు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్ వెల్లడించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఏడీఏ ఎస్పీ ఎల్లప్ప, విజిలెన్స్ అధికారులు డీ జీవానందం, వెంకటగిరి ఏడీఏ ఎం నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు. సరైన బిల్లులు లేని రూ.3.28 లక్షల మందుల స్టాక్‌ను గుర్తించి నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ (విజయవాడ) వారి ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయి బృందం సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణదారులు నాణ్యమైన ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దు చేయడంతో పాటు 6–ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఈఎస్ వరప్రసాద్, ఏఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 137
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 274
లేయర్ చికెన్	: 195



నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

జిల్లాలో గుప్పుమంటున్న గంజాయి

చాపకింద నీరులా విక్రయాలు
- మత్తుకు బానిసవుతున్న యువత
- అడపాదడపా దాడులతోనే పోలీసులు సరి



ఇటీవల స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. చాపకింద నీరులా విక్రయాలు సాగుతున్నాయి. యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు జిల్లాలో గంజాయి విక్రయాలు సాగించాలంటేనే భయపడే పరిస్థితి ఉండేది. ఓ వైపు పోలీసు, మరోవైపు సెబ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున గంజాయి వ్యాపారులు, సరఫరాదారులు, గంజాయి సేవించే వారిపై సైతం కేసులు నమోదు చేశారు. ఐదుగురు గంజాయి విక్రయదారులపై ఏకంగా పీడీ యాక్ట్‌లు సైతం నమోదు చేసి కటకటాల వెనక్కి పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలీసు, సెబ్ అధికారుల నిఘా కొరవడడంతో గంజాయి విక్రయాలు తిరిగి ఊపందుకున్నాయి. దుకాణాలు, బడ్డీకొట్లు, బార్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ విరివిగా లభ్యమవుతోంది. విద్యార్థులు, యువతే లక్ష్యంగా చేసుకుని విక్రయాలు సాగించడం మరింత ఆందోళన కలిగిస్తున్న అంశం. కొందరు వ్యాపారులు విశాఖపట్నం, నర్సీపట్నం, ఏఓబీ, తదితర ప్రాంతాల నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. ఎవ్వరికి అనుమానం రాకుండా ఉండేందుకు చిన్న చిన్న ప్యాకెట్లు, ద్రవ రూపంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చలవిడిగా గంజాయి దొరుకుతుండటంతో వాటి మత్తులో యువత నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. నెల్లూరులో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గత కొంతకాలంగా చోటు చేసుకుంటున్న నేరాల్లో అధికశాతం నేరాలు గంజాయి మత్తులో జరిగినవేనని తేటతెల్లమవుతోంది. యువత తెలిసీ, తెలియని వయస్సులో మత్తుకు బానిసలై నేరాలకు పాల్పడుతూ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు.

అడపాదడపా దాడులు

రాష్ట్రంలో గంజాయి విక్రయాలు, రవాణా, మద్యం అనధికార విక్రయాలు, అక్రమ రవాణా తదితరాలను పూర్తిస్థాయిలో కట్టడిచేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)ను ఏర్పాటు చేసి దాడులను ముమ్మరం చేసింది. సెబ్, స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున దాడులు చేసి గంజాయి విక్రయాలను కట్టడిచేశారు. సూత్రదారులపై కేసుల నమోదు చేసి జైళ్లకు పంపారు. నెల్లూరు నగరంలో గంజాయి విక్రయదారులైన అరవ రాజమ్మ, షేక్ సిరాజ్, షేక్ సుభాని, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ ముంతాజ్‌పై పీడీయాక్ట్‌లను నమోదుచేసి కటకటాల వెనక్కి పంపారు. దీంతో గంజాయి విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలో విజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోలీసు, సెబ్ అధికారుల నిఘా కొరవడింది. ఇదే అదనుగా భావించిన దుండగులు విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. గతేడాది 43 కేసులు నమోదు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం ఏడు కేసులే నమోదు చేయడం అధికారుల పనితీరుకు నిదర్శనం. ఇటీవల గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని స్వయంగా రాష్ట్ర హోంమంత్రి ఆదేశించినా జిల్లాలో నేటికి అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై గంజాయిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొన్ని ఘటనలు

- ఇటీవల ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించేందుకు వెళ్తుండగా సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 8.430కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- తాజాగా నెల్లూరులోని కిసాన్‌నగర్‌లో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని సమాచారం అందడంతో నవాబుపేట పోలీసులు దాడులు చేశారు. అక్కడున్న వారిని విచారిస్తున్నారు. సదరు గంజాయి విక్రయాలు సాగిస్తున్న వ్యక్తి ఎవ్వరన్న విషయంపై ఆరాతీస్తున్నారు.

జిల్లాకు దిగుమతి ఇలా...

విశాఖపట్నం, నర్సీపట్నం, ఏఓబీ సరిహద్దు ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు, తదితర మార్గాల ద్వారా గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. జిల్లాకు చెందిన కొందరు అక్కడి వ్యాపారులతో సంబంధాలు నెరుపుతున్నారు. గంజాయిని కేజీ రూ 4,500 చొప్పున కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటున్నారు. అనంతరం కేజీకి రూ.3వేల నుంచి రూ.4వేల వరకు మార్జిన్ పెట్టుకుని జిల్లాలోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వారు వంద, యాభై గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ 200 నుంచి రూ.400 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. తొలుత స్నేహితుడు చెప్పాడనో..సరదాగానో అలవాటుచేసుకున్న వారు మత్తుకు పూర్తిగా బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. మత్తుకు సరిపడా నగదు లేని వారు స్మగ్లర్లుగా అవతారమెత్తుతున్నారు. పలు దఫాలు పోలీసుల దాడుల్లో విద్యార్థులు పట్టుబడ్డారు. కొన్ని విద్యాసంస్థల్లోనూ గంజాయి విరివిగా దొరుకుతుండడంతో అక్కడి విద్యార్థుల్లో అనేక మంది మత్తులో జోగుతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్‌మనీ, పార్ట్‌టైం ఉద్యోగాల ద్వారా సంపాదించుకున్న నగదును గంజాయికే ఖర్చుపెడుతున్నట్లు తెలుస్తోంది. వీటన్నంటిని చూస్తుంటే జిల్లాలో గంజాయి విక్రయాలు ఏ స్థాయిలో వేళ్లూనుకుని ఉన్నాయో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరంలేదు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా



బోల్తాపడిన గ్యాస్ సిలిండర్ల లారీ

దుత్తలూరు: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన దుత్తలూరు సమీపంలో 565వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఏపీ39 యూఏ 2194 నంబర్ గల లారీ హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లోడుతో శనివారం రాత్రి అనంతపురం నుంచి కనిగిరికి బయలుదేరింది. ఆదివారం ఉదయం దుత్తలూరు సమీపంలోని ఏపీ కాలనీ వద్దకు లారీ రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి

కలిగిరి: మద్యం మత్తులో ఓ వ్యక్తి గ్రాఫిక్ షాపు నిర్వాహకుడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన కలిగిరిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కలిగిరిలోని మల్లితోటలో కడియాల శ్రీనివాసాచారి గ్రాఫిక్ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన షాపులో పక్కనున్న వ్యాపారులతో మాట్లాడుతూ కూర్చుని ఉన్నాడు. తెల్లపాడు గ్రామానికి చెందిన కనుపర్తి వెంకటరమణయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో సమీపంలో ఉన్న బేకరీ షాపు వాళ్లతో గొడవపడ్డాడు. అనంతరం అటుగా వెళ్తూ గ్రాఫిక్ షాపు వద్దకు వచ్చి శ్రీనివాసాచారిని ఓ శుభకార్యానికి సంబంధించిన కార్డులను ముద్రించాలని అడిగాడు. శ్రీనివాసాచారి సమాధానం చెప్పేలోగానే అతని చేతిపై వెంకటరమణయ్య తన వద్ద ఉన్న కత్తితో (షేవింగ్ చేసే కత్తి) తీవ్రంగా గాయపరిచాడు. శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సంతోష్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పులు

- యూపీఐ చెల్లింపులపై ఆర్బీఐ ఆంక్షలు
- ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం
- ఈఆర్వో ఆఫీసుల్లోనూ బిల్లుల స్వీకరణ



ఎస్పీడీసీఎల్ విడుదల చేసిన క్యూఆర్‌కోడ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు యూపీఐ పేమెంట్ యాప్‌లైన గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్‌పే ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం ఉండేది. ఈ చెల్లింపులపై సమీక్షించిన రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు స్వీకరించొద్దని ఆదేశించింది. ఫలితంగా ఈ నెల నుంచి యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో విద్యుత్ సంస్థ ఇక నుంచి వినియోగదారులు బిల్లులను నేరుగా తమకు మాత్రమే చెల్లించాలని ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలా చెల్లించలేని వారు విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలకు వెళ్లి నేరుగా చెల్లించాలని సూచిస్తోంది.

యూపీఐ యాప్‌ల రాకతో..

గతంలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల వద్ద వినియోగదారులు గంటల తరబడి క్యూలైన్లలో నిలుచుని విద్యుత్ బిల్లులు చెల్లించే వారు. అప్పట్లో వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. కరోనా తరువాత యూపీఐ పేమెంట్స్ వినియోగం పెరగగింది. విద్యుత్ సంస్థ కూడా సులభంగా బిల్లుల చెల్లించేలా యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో బిల్లులను చెల్లించే వారు ఎక్కువయ్యారు. ప్రధానంగా ఎల్‌టీ విద్యుత్ సర్వీసులు కలిగిన వినియోగదారులు అధికంగా బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో యాప్‌ల ద్వారా చెల్లింపులపై ఎలాంటి సర్వీసు చార్జీలు విధించడం లేదు. గతేడాది నుంచి యూపీఐ యాప్‌ల నిర్వాహకులు విద్యుత్ సంస్థ నుంచి నామమాత్రంగా చార్జీలను వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు కచ్చితంగా లైసెన్స్ అవసరమని, లైసెన్స్ ఉంటేనే బిల్లుల చెల్లింపుల ప్రక్రియను కొనసాగించాలని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్‌లు పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ఆయా యాప్‌లు బిల్ పేమెంట్ ఆప్షన్‌ను తొలగించాయి. ఆన్‌లైన్ చెల్లింపుల్లో థర్డ్‌పార్టీ యాప్స్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తే అందుకు సంబంధించిన నగదు విద్యుత్ సంస్థకు చేరేందుకు మూడ్రోజుల సమయం పడుతుంది. అదేవిధంగా కొన్ని యాప్‌ల ద్వారా చెల్లించే క్రమంలో నగదు జమకాకుండా నిలిచిపోవడం జరుగుతోంది. అదే ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లిస్తే నేరుగా విద్యుత్ సంస్థ ఖాతాలోకి చేరుతుంది. బిల్లులకు సంబంధించిన చెల్లింపులు యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లిస్తే నేరుగా విద్యుత్ సంస్థ ఖాతాలో జమకావాల్సిందేనని ఆర్‌బీఐ నిబంధన కూడా విధించింది. అందుకు లైసెన్స్‌ను తప్పనిసరి చేయడంతో యూపీఐ యాప్‌ల యాజమాన్యాలు అందుకు తగినట్లుగా అనుమతులు తీసుకోవడంలో నిమగ్నమవుతున్నాయి. యూపీఐ యాప్స్ యాజమాన్యాలు లైసెన్స్ పొంది, విద్యుత్ సంస్థకు నేరుగా చెల్లింపుల నగదు జమయ్యే ప్రక్రియ పూర్తయితే పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు విద్యుత్ వినియోగదారులు మాత్రం బిల్లులను ఎస్పీడీసీఎల్ యాప్ లేదా వైబ్‌సైట్ లేదా బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుంది.

71 శాతం ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసులు 12,72,476 ఉన్నాయి. హెచ్‌టీ, పరిశ్రమలకు చెందిన సర్వీసులు మరో 30వేల వరకు ఉన్నాయి. విద్యుత్ సంస్థకు బిల్లుల రూపంలో రూ.295 కోట్లను చెల్లిస్తున్నారు. అందులో గృహ, వాణిజ్య సరీసులకు సంబంధించి రూ.145 కోట్లు, హెచ్‌టీ, పరిశ్రమలకు సంబంధించి రూ.150 కోట్లను చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపుల్లో ఎక్కువ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారానే చెల్లిస్తున్నారు. 8,35,587 సర్వీసులకు సంబంధించిన వినియోగదారులు డిజిటల్ పేమెంట్ల ద్వారా బిల్లులను చెల్లిస్తున్నారు. జిల్లాలో ప్రతి నెలా డిజిటల్ పేమెంట్ల ద్వారా బిల్లులు చెల్లిస్తున్న వారు 71 శాతం మంది ఉండగా, రూ.100 కోట్ల నగదు వసూలు అవుతోంది.

యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలి



ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను విద్యుత్ సంస్థ మొబైల్ యాప్ లేదా www.apspdcl.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవకాశం లేదు. వెబ్‌సైట్ ద్వారా బిల్‌డెస్క్‌కు అనుసంధానమైన యూపీఐ, నెట్‌బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, తదితర ఆప్షన్ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు.

– విజయన్, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్

ఆర్‌బీఐ ఆదేశాల మేరకే



ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులను నిలిపివేయడం జరిగింది. ఎస్పీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌లలో స్కాన్ చేసుకుని విద్యుత్ సర్వీసు నంబర్‌ను ఎంటర్ చేసి బిల్లులు చెల్లించొచ్చు.

– సోమశేఖర్‌రెడ్డి, నెల్లూరుటౌన్ ఈఈ, ఎస్పీడీసీఎల్

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న బస్సు



సురేష్‌రెడ్డి మృతదేహం



ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- ఒకరి మృతి...మరొకరికి తీవ్ర గాయాలు

మనుబోలు: మోటార్‌సైకిల్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు..గూడూరులోని బాలాజీనగర్‌కు చెందిన మనుబోలు సురేష్‌రెడ్డి, అతని స్నేహితుడు పర్వతాల ప్రశాంత్‌కుమార్ ఉద్యోగ నిమిత్తం కృష్ణపట్నం పోర్టుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. కొమ్మలపూడి సమీపంలోని గ్లాస్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే వెనుక నుంచి ప్రైవేట్‌ట్రావెల్స్ బస్సు వేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌ను నడుపుతున్న సురేష్‌రెడ్డి(45) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, వెనుక కూర్చున్న ప్రశాంత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. మనుబోలు ఎస్సై అజయ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రం సరికొత్త ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరికొత్త ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరు నగరంలో నూతనంగా నిర్మించిన సీపీఎం కార్యాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో మత ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపించారు. మతాన్ని రెచ్చగొట్టడం ద్వారా బలపడేందుకు బీజేపీ ఆ విధానాన్ని అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఎప్పుడో తిరస్కరించారని, అయినప్పటికీ టీడీపీ, జనసేన పార్టీల పొత్తు ద్వారా, వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందుకు కోసం దేనికైనా తెగబడుతుందన్నారు. బిహార్ రాష్ట్రంలో జేడీయూ పార్టీ ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తిందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాలకులు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. రాష్ట్రంలో బలపడేందుకు సీపీఎం సొంత రాజకీయ విధానంతో ముందుకు వెళ్లనుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, బత్తల కృష్ణయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.